క్లుప్తంగా

3న అయ్యప్ప అఖండ పూజోత్సవం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అయ్యప్పసేవా సంఘ సభ్యులు

నాయుడుపేట టౌన్: ప్రతి ఏటా అత్యంత వైభవంగా నిర్వహించే అయ్యప్ప స్వామి అఖండ జ్యోతి పూజోత్సవ వేడుకలను డిసెంబర్ నెల 3 తేదీన ఘనంగా నిర్వహిస్తున్నట్లు అయ్యప్ప సేవా సంఘ అధ్యక్షుడు కామిరెడ్డి రాజారెడ్డి తెలిపారు. అఖండ జ్యోతి పూజోత్సవ కరపత్రాలను మంగళవారం కనమర్లపూడి సుబ్రమణి కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. రాజారెడ్డి మాట్లాడుతూ 43వ జ్యోతి పూజోత్సవాన్ని డిసెంబర్ నెల 3, 4 తేదీల్లో రెండు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అయ్యప్పస్వామి సేవా సంఘం ప్రతినిధులు జలదంకి వెంకట కృష్ణారెడ్డి, పాపాడి చంద్రారెడ్డి, గంధవల్లి సిద్ధయ్య, చదలవాడ కుమార్, దేవత కిషోర్ శెట్టి, చిరువెళ్ల మునిరాజా, కందనూరు సంజయ్‌కుమార్, కోటకొండ బ్రదర్స్, సాధు మోహన్, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

స్తంభించిన ట్రాఫిక్

నాయుడుపేట టౌన్: జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించి పోయింది. పట్టణంలోని రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో రహదారిపై ప్రమాదకరంగా ఉన్న గుంతలో లారీ ఇరుక్కుని పోయి మరమ్మతులకు గురైంది. దీంతో అటు వైపు రాకపోకలు స్తంభించి పోయాయి. శనివారం ఉదయం నుంచి ట్రాఫిక్ స్తంభించి జాతీయ రహదారికి ఇరువైపులా వాహనాలు నిలబడిపోయాయి. పోలీసులు హుటాహుటిన చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించి, వాహనాలు వెళ్లేలా చర్యలు చేపట్టారు. రోడ్డుపై నిలబడి పోయిన లారీని క్రేన్ సహాయంతో పక్కకు తొలగించారు.

భక్తులకు అన్నదానం



అన్నదాన కార్యక్రమం

కోట: పంచాయతీ పరిధిలోని శ్యామసుందరపురంలో వెలసి ఉన్న అంకాళమ్మ పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు సుబ్బారావు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. శ్యామసుందరపురానికి చెందిన విద్యార్థి కరుణ చదువుకు రూ.5 వేలు సాయం అందించారు. ఈ కార్యక్రమంలో బాబూరావు, మోహన్, రాము, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఉద్యోగుల నిరసన



నిరసన చేపడుతున్న ఎల్ఐసీ ఉద్యోగులు

చిల్లకూరు: ఎల్ఐసీ ఉద్యోగులకు ప్రధాని ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని మధ్యాహ్న భోజన సమయంలో ఎల్ఐసీ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. గూడూరు పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన చేపట్టిన ఉద్యోగులు, బ్రాంచ్ మేనేజర్ విజయభాస్కర్ మాట్లాడుతూ రైతులకు సమగ్ర రుణమాఫీ, కనీస మద్దతు ధరకు చట్ట భద్రత కల్పించాలని, ఎల్ఐసీలో ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యదర్శి నాగరాజు, ఎస్‌డీ మహబూబ్‌బాషా, శేఖరరెడ్డి, అశోక్‌కుమార్, ఎస్‌కే మీరాసాహెబ్, విజయకుమార్, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు పడిపూజ

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురంలోని శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం ధర్మకర్త హైటెక్ శ్రీను ఆధ్వర్యంలో 18 మెట్ల పడిపూజ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అయ్యప్ప మాలధారులు పడిపూజలో పాల్గొనాలని కోరారు.

విద్యార్థులకు అవగాహన శిబిరం

దొరవారిసత్రం: నేలపట్టు పక్షుల కేంద్రంలో మంగళవారం స్థానిక వన్యప్రాణి విభాగం అధికారులు విద్యార్థులకు అవగాహన శిబిరం నిర్వహించారు. తిరుపతి పట్టణ ప్రాంతంలోని ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు నేచుర్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా పక్షుల కేంద్రం ప్రాముఖ్యత, పర్యావరణంలో పక్షుల ప్రాధాన్యత, అడవుల పరిరక్షణ తదితర అంశాలపై విద్యార్థులకు అటవీ అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ బాలయ్య, అటవీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేడుకగా సత్యనారాయణ స్వామి వ్రతం

రాపూరు: రాపూరులోని షిర్డీ సాయిబాబా మందిరంలో మంగళవారం కార్తీక బహుళ ఏకాదశిని పురస్కరించుకుని సామూహిక సత్యనారాయణ వ్రతాన్ని నిర్వహించారు. సుమారు 50 జంటల చేత వేదపండితులు సత్యనారాయణ స్వామి వ్రతం చేయించారు. ఆలయం వెలుపల ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపంలో సత్యనారాయణస్వామి చిత్రపటాన్ని, కలశం ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు అన్నప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కారికాడు ఎస్సీ కాలనీలో అస్తవ్యస్తంగా ఉన్న వీధి



వేలికాడులో వీధిలో నిలిచిన వర్షపునీరు



అడుగడుగునా అపరిశుభ్రత

వర్షాలు కురుస్తుండడంతో పలు గ్రామాల్లోని వీధులు వర్షపునీటితో నిండి అత్యంత దారుణంగా దర్శనమిస్తున్నాయి. పదుల సంఖ్యలో ఎస్సీ, ఎస్టీ కాలనీలోని వీధులు ఓ వైపు వర్షపు నీరు, మరో వైపు పిచ్చి మొక్కలతో నిండిపోయి దయనీయంగా ఉన్నాయి. పారిశుధ్య చర్యలు చేపట్టాల్సిన పంచాయతీ పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో వివిధగ్రామాల్లో అడుగడుగునా అపరిశుభ్రత తాండవిస్తోంది. అంటురోగాలు ప్రబలే అవకాశాలు ఉండడంతో గ్రామాల్లోని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

– దొరవారిసత్రం

- దారుణంగా గ్రామాల్లోని వీధులు
- పల్లె ప్రజలకు సీజనల్ వ్యాధుల ముప్పు
- చేతులెత్తేసిన పంచాయతీ పాలకులు, అధికారులు

దొరవారిసత్రం మండలంలో 22 గ్రామ పంచాయతీలకు 11 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో 65 గ్రామాల్లో 39,500 మంది జనాభా ఉన్నారు. సగానికి పైబడి పలు గ్రామ పంచాయతీల్లోని గ్రామాల్లోని వీధులు, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లోని వీధుల్లో వర్షపు ఎక్కడికక్కడ నిలిపోయి ఉన్నాయి. దీంతో ఆయా గ్రామాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా శ్రీధనమల్లి, కల్లూరు, కల్లూరుకండ్రిగ, కట్టువాపల్లి, ఆనేగొట్టం, వేణుంబాకం, వెదురుపట్టు, మినమనముడి, కొత్తపల్లి గ్రామాలతోపాటు తీర గ్రామాలైన కారికాడు, వేలికాడు, మీజూరు తదితర గ్రామాల్లోని వీధులు అపరిశుభ్రంగా ఉన్నాయి. ఆయా గ్రామాల పరిధిలో ఉన్న ఎస్సీ, ఎస్టీ కాలనీల వీధుల్లో నిలిచిన నీరు దుర్గంధం వెదజల్లుతోంది. రాత్రిళ్లు దోమలు స్వైర విహారం చేస్తున్నాయని గ్రామాల్లోని ప్రజలు వాపోతున్నారు. వీధుల్లో కనీసం నడవాలంటే కూడా నానాఇబ్బందులు పడాల్సి వస్తోంది. వీధులను శుభ్రం చేసి, సహాయక చర్యలు చేపట్టాల్సిన పంచాయతీ పాలకులు, వైద్య సిబ్బంది, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు.

కానరాని క్లోరినేషన్ పనులు

తీర గ్రామాలైన కారికాడు, వేలికాడు, మీజూరు గ్రామాలతోపాటు కట్టువాపల్లి, కల్లూరు, కేపీవీ కండ్రిగ, శ్రీధనమల్లి తదిర గ్రామాల్లోని వీధుల్లో ఎక్కడపడితే అక్కడ వర్షపునీరు నిలిచిపోవడంతోపాటు పిచ్చిమొక్కలు మొలిచిపోయి దారుణం ఉన్నాయి. అంటురోగాలు ప్రబలకుండా ఆయా ప్రాంతాల్లోని వైద్య సిబ్బంది, సచివాలయం సిబ్బంది కలిసి క్లోరినేషన్ పనులు చేపట్టాలి. అయితే ఈదిశగా ఎవరూ కూడా పట్టించుకున్న దాఖలాలు లేవు.



వేలికాడులో వీధిలో నిలిచిన వర్షపునీరు

వీధుల్లో నడవలేకపోతున్నాం



ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామం, ఎస్సీ కాలనీల్లోని వీధులు చాలా దారుణంగా తయారయ్యాయి. కొన్ని వీధుల్లో అయితే వర్షపు నీరు నిలిచిపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. వీధుల్లో అపరిశుభ్రంగా ఉన్న సమస్యలను ఎవరూ పట్టించుకోవడంలేదు.

- రాయపు వెంకటయ్య, వేలికాడు గ్రామం

దోమలు అధికంగా ఉన్నాయి



వీధుల్లో వర్షం నీళ్లతోపాటు పిచ్చిమొక్కలతో నిండిపోయి ఉండడంతో రాత్రుల సమయంలో దోమలు అధికంగా ఉన్నాయి. ఎక్కడ అంటు రోగాలు వస్తాయోనని ఆందోళన తప్పడంలేదు. సహాయక చర్యలు చేపట్టి అంటురోగాలు రాకుండా చర్యలు తీసుకోవాలి.

- గెల బాలయ్య, శ్రీధనమల్లి గ్రామం

సాగుకు సన్నద్ధం



ఓజిలి సమీపంలో ఎల్లిపైరులో వర్షపునీరు

ఓజిలి: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చెరువుల్లో నీరుచేరడంతో రైతులు నారుమడులు సిద్ధం చేస్తున్నారు. బత్తలాపురం, ఓజిలి, భట్లకనుపూరు గ్రామాల్లో 500 ఎకరాల్లో ఎల్లిపైర్లు సాగు చేస్తున్నారు. ఎల్లిపైరు ఎండిపోతున్న తరుణంలో ఈ వర్షం పడడం ఊరటనిచ్చింది. ముమ్మాయిపాళెం, మాచవరం, తిరుమలపూడి, కొత్తపేట, పున్నేపల్లి తదితర గ్రామాల్లో మరో 3000 ఎకరాల్లో వరిని నాటి సాగు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. మరి కొన్ని గ్రామాల్లో పచ్చిరొట్ట పైర్లను ట్రాక్టర్లతో దుక్కి చేస్తున్నారు.

చెరువులు, మామిడి కాలువకు జలకళ

మండలంలో 61 చెరువులు ఉన్నాయి. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు కాలువులు, వంకలలోని వర్షపునీరు చెరువులకు చేరుతోంది. దీంతో చెరువులు జలకళ సంతరించుకున్నాయి. మండలంలోని పున్నేపల్లి, మానమాల గ్రామాల వద్ద ప్రవహిస్తున్న మామిడి కాలువలో వర్షపు నీరు చేరి నిండుకుండలా ప్రవహిస్తోంది.

కనుల పండువగా గ్రామోత్సవం



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తి

సైదాపురం: కార్తీక మాసం పురస్కరించుకుని సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు సైదాపురంలో శ్రీసిద్ధలయ్య స్వామి గ్రామోత్సవాన్ని బలిజసంఘం ఆధ్వర్యంలో కనుల పండువగా నిర్వహించారు. స్వామివారికి భారీ పూలమాలలను వేసేందుకు ఆంజనేయస్వామి గుడి వద్ద నుంచి వాహనంలో ఊరేగింపు ప్రారంభించారు. అనంతరం మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపకాంతులు, విచిత్ర వేషధారణలు, తప్పెట్లు, మేళతాళాల నడుమ స్వామివారి గ్రామోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.

అరకొరగా ఫ్యామిలీ డాక్టర్ సేవలు



నేలపట్టులో పంచాయతీ భవనంలో రోగులకు వైద్య సేవలు

దొరవారిసత్రం: దొరవారిసత్రం, తొగరాముడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని వైద్య సేవలకు దూరంగా ఉన్న గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ సర్వీసెస్(ఎఫ్‌డీఎస్) ద్వారా రోగులకు వైద్య సేవలను ఆయా పీహెచ్‌సీల వైద్యులు, 104 వాహన సిబ్బంది సేవలందించాలి. అయితే ఈ సేవలు అరకొరగా అందుతున్నాయి. వైద్య శిబిరాలకు హాజరు కావాల్సిన వైద్యులు పూర్తి డుమ్మా కొట్టడంతో గ్రామాల్లోని రోగులకు సరైన వైద్య సేవలు అందడం లేదు. మంగళవారం డీవీ సత్రం పీహెచ్‌సీలోని నెలబల్లి విలేజ్ హెల్త్ సెంటర్ పరిధిలోని నేలపట్టు గ్రామంలో ఎఫ్‌డీఎస్ కార్యక్రమం నిర్వహించగా కేవలం విలేజ్ హెల్త్ సెంటర్ సిబ్బంది, 104 సిబ్బంది మాత్రమే హాజరై వైద్య శిబిరానికి విచ్చేసిన రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. డీవీ సత్రం పీహెచ్‌సీలో ఒకరికి ఇద్దరు వైద్యులు ఉన్నా ఏ ఒక్కరూ హాజరు కాకపోవడం గమనార్హం.

ఉపాధి కల్పించాలని గ్రామస్తుల విజ్ఞప్తి



ఉపాధి కల్పించాలని స్టీల్ పరిశ్రమ వద్దకు చేరుకున్న మహిళలు

పెళ్లకూరు: స్థానిక స్టీల్ పరిశ్రమలో ఉపాధి కల్పించాలని పెన్నేపల్లి గ్రామానికి చెందిన పలువురు మహిళలు మంగళవారం కంపెనీ ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. స్టీల్ పరిశ్రమ ఏర్పాటు సమయంలో అర్హులైన స్థానికులకు ఉద్యోగాలు, రోజు వారీ కూలీ కింద మహిళలకు అవకాశం కల్పిస్తామన్న యాజమాన్యం ప్రస్తుతం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అదేవిధంగా గ్రామానికి వాటర్‌ప్లాంట్, ప్రతి నెలా మెడికల్ చెకప్, స్కూల్ డెవలప్‌మెంట్ తదితర మౌలిక సదుపాయాల కల్పనకు తమ వంతు సహకరిస్తామని మాట ఇచ్చినట్లు వివరించారు. అయితే కొందరు కంపెనీ ప్రతినిధులు గ్రామాభివృద్ధిని పట్టించుకోకుండా గ్రామస్తుల మధ్య వివాదాలకు కారకులుగా వ్యవహరించడం అన్యాయమన్నారు. చక్రపాణి, శ్యామల, భూదేవమ్మ, దేవసేనమ్మ, ఆదెమ్మ, సులోచనమ్మ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహంలో తనిఖీలు



బీసీ కాలేజీ విద్యార్థుల వసతి గృహం వద్ద ఆర్ఐ తనిఖీలు

నాయుడుపేట టౌన్: పట్టణంలోని బీసీ కాలేజీ విద్యార్థుల వసతి గృహంలో మంగళవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎన్. సాయితేజ తనిఖీలు చేపట్టారు. వసతి గృహ విద్యార్థులు సమస్యలపై తహసీల్దార్ రాజేంద్రకు ఫిర్యాదు చేయడంతో ఆయన ఆదేశాల మేరకు ఆర్ఐ వసతి గృహం వద్దకు చేరుకుని విద్యార్థులు చెప్పిన సమస్యలపై ఆరా తీశారు. ముఖ్యంగా వసతి గృహంలో నాణ్యమైన భోజనం పెట్టడం లేదని తెలిపారు. మధ్యాహ్న భోజనానికి క్యారేజీలలో పెట్టే అన్నం, కూరలు తినే సమయాని పాచిపోతుందని ఆర్ఐకు వివరించారు. ఇంకా విద్యార్థులు వినతి పత్రంలో పేర్కొన్న సమస్యలపై ఆరా తీశారు. వసతి గృహం వార్డెన్ శ్రీనివాసులు, వంట మహిళ, సర్వెంట్లతో మాట్లాడి అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. పరిస్థితులను ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆర్ఐ తెలిపారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



పెళ్లకూరులో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

నాయుడుపేట టౌన్: భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. బామ్‌సెఫ్ అధ్వర్యంలో ఆ సంఘ డివిజన్ పరిధిలోని నాయకులు భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. బీఎస్పీ తదితర పార్టీల నాయకులు పాత బస్టాండు వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బిరదవాడ, మేనకూరు తదితర గ్రామాల్లో ఉన్న రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాల వద్ద నాయకులు ఘన నివాళులర్పించారు.

కోటలో..

కోట: బీఆర్ అంబేడ్కర్ రూపొందించిన భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు పేర్కొన్నారు. కోటలో పలు దళిత సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకపోరాట సమితి ఆధ్వర్యంలో కోటక్రాస్ రోడ్డు నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. మీజూరు మాధవ్, డాక్టర్ రామక్రిష్ణారావు, దాసరి సుందరం, పాల మల్లికార్జున్, హేమంత్, వసంత్ తదితరులు పాల్గొన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధన సమితి అధ్యక్షుడు ఆర్వీ రమణయ్య అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు హెచ్ఎం విజయభాస్కర్ బహుమతి ప్రదానం చేశారు. ఎస్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపల్ చంద్రశేఖరరెడ్డి, రాజేష్, గాది శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెళ్లకూరులో..

పెళ్లకూరు: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం 75వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ ప్రమీలారాణి, ఉపాధి హామీ ఏపీఓ దయానంద్, సిబ్బంది పాల్గొన్నారు.

చిల్లకూరులో...

చిల్లకూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా తొణుకుమాల గ్రామ పంచాయతీలో చేపడుతున్న అమృత్ సరోవర్‌ల వద్ద మంగళవారం రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ గిరి, సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని గౌరవించాలి



ప్రతిజ్ఞ చేస్తున్న జడ్జిలు, న్యాయవాదులు

గూడూరు రూరల్: భారతదేశ రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరు గౌరవించాలని గూడూరులోని ఏడో అదనపు జిల్లా జడ్జి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం సూచించారు. గూడూరు కోర్టు ఆవరణలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ పీఠికను సిబ్బంది అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి పౌరుడు సద్వినియోగం చేసుకునేలా హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం రాజ్యాంగ ప్రతిని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి బి.రాజేష్, జూనియర్ సివిల్ జడ్జి బీవీ సులోచనరాణి, అడిషనల్ జుడిషియల్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ లోకనాథం, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శంకరయ్య, ఏఓ పద్మావతి, నయోమి, ఏపీపీ లక్ష్మణ్‌నారాయణ, న్యాయవాదులు అరవ పార్వతయ్య, మహబూబ్‌బాషా, పెంచలయ్య పాల్గొన్నారు.

విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలి

– బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేసిన జడ్జి సంయుక్త



విద్యార్థినులతో మాట్లాడుతున్న జడ్జి సంయుక్త

నాయుడుపేట టౌన్: విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించి మంచి పేరు తెచ్చుకోవాలని నాయుడుపేట జూనియర్ సివిల్ కోర్టు జడ్జి, మండల లీగల్ సెల్ సర్వీసు అథారిటీ చైర్ పర్సన్ పి.సంయుక్త సూచించారు. పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహం సమీపంలో ఉన్న ఎస్సీ బాలికల వసతి గృహాన్ని మంగళవారం సాయంత్రం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పసల గంగాప్రసాద్, లోక్ అదాలత్ న్యాయవాదులతో కలిసి జడ్జి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అద్దె భవనంలో ఉన్న వసతి గృహంలో వర్షానికి ఉరుస్తు విద్యార్థినులు పడుతున్న ఇబ్బందులను జడ్జి గమనించారు. సమస్యలను పరిష్కరించే చర్యలు చేపడుతామన్నారు. వసతి గృహంలో న్యాయ విజ్ఞాన చైతన్య సదస్సు నిర్వహించారు. న్యాయవాదులు సురేష్, ఎం.సునీల్, సుధీర్, సుధీర్‌రెడ్డి, వార్డెన్ జి.లక్ష్మీరాణి పాల్గొన్నారు.

మహనీయుల అడుగుజాడల్లో...



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చైర్ పర్సన్, ఎంపీపీ, నాయకులు

నాయుడుపేట టౌన్: భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తదితర మహనీయులు ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, వైస్ చైర్మన్ వెంకట కృష్ణారెడ్డి, ఎంపీపీ ధనలక్ష్మీ కోరారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సూచనల మేరకు వైఎస్ఆర్ సీపీ నాయకులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు విగ్రహానికి ఘన నివాళులర్పించారు. నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి, చదలవాడ కుమార్, గంధవల్లి సిద్ధయ్య, దారా రవి, పాపాడి చంద్రారెడ్డి, కాలగంధ సునీల్, బాలకృష్ణారెడ్డి, కావేరిపాకం అశోక్‌కుమార్, భాను, సాధు శాంతి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

సూళ్లూరుపేట రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడి తుపాను మరే అవకాశం ఉండడంతో అధికారులతోపాటు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ కిరణ్మయి తెలిపారు. డివిజన్ నుంచి అన్ని తహసీల్దార్ కార్యాలయాలు, సూళ్లూరుపేటలో ఉన్న రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో తుపాను హెల్ప్‌లైన్ సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. 24 గంటల వరకు ప్రజలకు అధికారులంతా అందుబాటులో ఉండాలని సూచించారు. తుపాను ప్రభావంతో రాబోయే రెండు రోజుల వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు పడుతాయని పేర్కొన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లొదని సూచించారు. 08623–295345 నెంబర్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు.

29న మున్సిపల్ మీట్

వెంకటగిరి(సైదాపురం): 25 వార్డుల్లో చేపట్టే అభివృద్ధి పనులపై ఈనెల 29వ తేదీన కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఇన్‌చార్జి కమిషనర్ రాయిపూడి శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

మత్తులో వాహనాలు నడిపితే ఉపేక్షించం

నాయుడుపేట టౌన్: మద్యం తాగి వాహనాలు నడిపేతే ఉపేక్షించేది ఉండదని నాయుడుపేట అర్బన్ సీఐ బాబి హెచ్చరించారు. అర్బన్ పోలీస్‌స్టేషన్లో మంగళవారం సాయంత్రం సీఐ విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో ప్రతి రోజు ప్రధాన కూడళ్ల, ఇతర ప్రాంతాల్లో తనిఖీలు చేస్తున్నట్లు వెల్లడించారు. 10 మందికి పైగా మద్యం తాగి వాహనం నడుపుతున్న వారికి రూ.10 వేల జరిమానా విధించినట్లు పెర్కొన్నారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారితోపాటు వాహనాదారులపై కూడా కేసులను నమోదు చేస్తున్నట్లు వివరించారు.